


# కరపత్రం

SINCE 2014

గురువారం జూలై 10 2025 | సంపుటి :0 | సంచిక :265 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## నమీబియా పర్యటనలో మోడీ

### ఆ దేశ అత్యున్నత పురస్కారం ప్రదానం

న్యూఢిల్లీ,జూలై9:

నమీబియా పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్నారు. 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్షియా మిరాబిలిస్' పురస్కారాన్ని నమీబియా అధ్యక్షురాలు నెతుంబో నంది-ద్వైత్వా బుధవారం ప్రధాని మోదీకి అందజేశారు. ఈ అవార్డు అందుకున్న తొలి భారతీయ నేత మోడీ కావడం విశేషం. 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచి మోదీకి ఇది 27వ అంతర్జాతీయ పురస్కారం. ఐదు దేశాల పర్యటనలో భాగంగా చివరిదైన నమీబియాలో ప్రధాని మోదీ ప్రస్తుతం పర్యటిస్తున్నారు. ప్రధాని హోదాలో ఆ దేశాన్ని సందర్శిస్తుండటం ఇదే మొదటిసారి. ఇక్కడ పర్యటిస్తున్న మూడో భారత ప్రధాని కూడా ఆయనే. ఈ క్రమంలోనే నమీబియా అధ్యక్షురాలితో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణ, ఇంధనం తదితర రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు ఇరుదేశాలు నాలుగు ఒప్పందాలపై సంతకం చేశాయి. ఈ నెల 2 నుంచి ప్రధాని మోదీ ఐదు దేశాల పర్యటన ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్ దేశాల్లో పర్యటించారు. ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఆయా దేశాల నేతలతో చర్చలు జరిపారు. బ్రెజిల్‌లోని రియో వేదికగా నిర్వహించిన బ్రిక్స్ సదస్సులో పాల్గొన్నారు. ప్రస్తుత పర్యటనలో అర్జెంటీనా మినహా మిగతా నాలుగు దేశాల అత్యున్నత పురస్కారాలను అందుకోవడం విశేషం.

# జగన్‌తో కలిసి తెలంగాణకు మరణశాసనం

## ములాఖత్‌లతో కృష్ణా జలాల వాటాకు తిలోదకాలు

» జగన్‌తో అంటకాగి ప్రయోజనాలు దెబ్బతీసిన కెసిఆర్
» బేసిన్లు లేవు..భేషజాలు లేవంటూ కొంపముంచిన గులాబీ బాస్
» ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సిఎం రేవంత్ వ్యాఖ్యలు
» పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడంతోనే సమస్యలన్న ఉత్తమ్



హైదరాబాద్,జూలై9:

గత పదేళ్లలో కెసిఆర్ అనుసరించిన విధానాల వల్ల తెలంగాణకు నీటి వాటాల్లో తీరని నష్టం జరిగిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ నిర్ణయాలు కృష్ణా పరివాహక ప్రాంతాల రైతులకు మరణ శాసనంగా మారాయి. జగన్‌తో అంటకాగడం వల్ల పరయోజనాలు దెబ్బతీసారని అన్నారు. మాజీ సీఎంలు కేసీఆర్, జగన్ అనుబంధం ఎలాంటిదైనా తెలంగాణకు తీరని నష్టం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలకు మరణశాసనం రాసే అధికారం కేసీఆర్‌కు ఎవరూ ఇవ్వలేదని చెప్పారు. గత ప్రభుత్వం వాదించి ఉంటే హైదరాబాద్‌కు తాగునీరు సాధించేవాళ్లమని అన్నారు. కృష్ణా జలాల అంశంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు సీఎం హాజరై మాట్లాడారు. బేసిన్లు లేవు.. భేషజాలు లేవని కేసీఆర్ గతంలో అన్నారు. గోదావరి నుంచి 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని చెప్పారు. గోదావరి, కృష్ణా, పెన్నా బేసిన్ వరకు నీళ్లు తరలించుకోవచ్చన్నారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామన్నారు. జగన్‌కు సూచనలతో పాటు టెండర్లు, జీవోలు ఇచ్చేలా సహకరించారు. ఉమ్మడి కోటా నుంచి హైదరాబాద్‌కు తాగునీరు జలాలను వేరు చేయాల్సి ఉంది. మిగిలిన జలాలను పరివాహక ప్రాంతాలకు పంపకాలు చేసి ఉంటే బాగుండేది. తుంగభద్ర, కృష్ణా, బీమా జలాలు తొలుత గద్వాలకు వస్తాయి. తెలంగాణకు వచ్చిన వెంటనే ఒడిసి పట్టుకోవాల్సి ఉంది. వెంటనే పాలమూరు-రంగారెడ్డి, నల్గొండ ఇతర ప్రాంతాలకు తరలించాలి.

2లో..




## హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్మోహన్‌రావు అరెస్ట్

హైదరాబాద్:

సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ, హైదరాబాద్ క్రికెట్ అసోషియేషన్ వివాదంలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్మోహన్‌రావును తెలంగాణ సీఐడీ బుధవారం అరెస్ట్ చేసింది. జగన్‌తోపాటు హెచ్‌సీఏ ఆరుగురు సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఐపీఎల్ టికెట్ల వ్యవహారంలో విజిలెన్స్ సిఫార్సు మేరకు సీఐడీ ఈ చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. గత ఐపీఎల్ సీజన్‌లో హెచ్‌సీఏ-ఎస్‌ఆర్‌హెచ్ మధ్య టికెట్ల వివాదం జరిగిన సంగతి తెలిసిందే. హెచ్‌సీఏ ప్రెసిడెంట్ హోదాలో ఎస్‌ఆర్‌హెచ్ ఫ్రాంచైజీని జగన్‌మోహన్‌రావు బెదిరించారన్నది ప్రధాన అభియోగం. అయితే ఆ అభియోగాలన్నీ వాస్తవమేనని విజిలెన్స్ నిర్ధారించడంతో సీఐడీ ఇప్పుడు అరెస్టులు చేసింది.

2లో..

## తెలంగాణకు ఎరువుల కొరత లేకుండా సహకరిస్తాం: కేంద్రం



దిల్లీ:

యూరియా కోటా పెంచాలని ఇటీవల దిల్లీ పర్యటనలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తిపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఎరువుల కొరత లేకుండా రాష్ట్రానికి సహకరిస్తామని తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర అవసరాల మేరకు ఎరువులను సరఫరా చేయాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా ఆదేశాలు జారీ చేశారు. యూరియాను సాగేతరాలకు మళ్లించకుండా చూడాలన్నారు. అన్ని జిల్లాలకు యూరియా పంపిణీ చేసేలా చూడాలని సూచించారు. అలాగే, రాష్ట్రంలో యూరియా వినియోగం పెరగడంపైనా నడ్డా ఆందోళన వ్యక్తం చేశారు. 2024-25లో యాసంగిలో యూరియా అమ్మకాలు 21శాతం పెరిగాయన్న ఆయన.. సేంద్రియ సాగు ప్రోత్సాహానికి కేంద్రం సహకారం అందిస్తుందన్నారు. ప్రణామ్ పథకం ద్వారా రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఉంటాయని చెప్పారు.

## హైదరాబాద్ కేబీహెచ్‌బీ కల్తీ కల్లు ఘటనలో ఐదుకి చేరిన మృతులు



హైదరాబాద్:

కూకట్‌పల్లి పరిధిలో కలకలం రేపిన కల్తీ కల్లు మహమ్మారి ఊహించని విషాదంగా మారింది. కల్తీ కల్లుతాగి అస్వస్థతకు గురైన ఘటనలో మృతుల సంఖ్య ఐదుకి పెరిగింది.

## ఎన్నో కష్టాలు పడి ఈ స్థాయికి వచ్చా.. మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి : మంత్రి సీతక్క




హైదరాబాద్,జూలై9:

పురుషాధిక్య సమాజంలో ఎన్నో కష్టాలు పడి ఈ స్థాయికి వచ్చానన్నారు మంత్రి సీతక్క. మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న సీతక్క.. మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలన్నారు. పేదల సంక్షేమం కోసం పాటు పడుతున్నానని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొంటానని చెప్పారు. ప్రజలు గుర్తించిన వారే నిజమైన నాయకులన్నారు సీతక్క. నాయకులకు ఆత్మపరిశీలన అవసరమని సూచించారు. అవకాశాలు రాని నాయకులు అసంతృప్తి చెందవద్దని చెప్పారు. ఒక్కోసారి ఒక్కొక్కరికి అవకాశాలు వస్తాయని.. కష్టపడిన వారికే అవకాశాలు వస్తాయన్నారు. పార్టీ కోసం పాటు పడిన వారికే పెద్దపీట వేస్తామన్నారు.

## నేనూ కష్టపడి చదవి పైకి వచ్చా మీరూ తల్లిదండ్రులకు పేరు తెండి






- పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ
- మోడీ గిఫ్ట్ అని పేర్కొన్న కేంద్రమంత్రి బండి సంజయ్

కరీంనగర్,జూలై9:

తల దించుకుని చదవండి.. తలెత్తుకునే స్థాయికి చేరండి అని విద్యార్థులను ఉద్దేశించి కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మీ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు పెట్టుకోండి, మీరు చదువులో పైకి వెళ్లాలి. నేనంటే అభిమానించే పిల్లలే నా గెలుపుకు ప్రధాన కారణం. 50 శాతం ఓట్లు వారి వల్లే వచ్చాయి. పిల్లలపై మీరు చూపుతున్న ప్రేమకి నేను ఏం ఇచ్చినా రుణం తీరదని తెలిపారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ పుట్టినరోజు సందర్భంగా కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు

### - ప్రభాకర్ రావు ఫోన్ ,ల్యాప్ టాప్ సీజ్




హైదరాబాద్,జూలై9:

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు ఫోన్, ల్యాప్ టాప్ ను సిట్ సీజ్ చేసింది . వాటిని ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ కు పంపించారు. 2023 నవంబర్ 15 నుంచి 30 వరకు అందిన సర్వీసు ప్రొవైడర్ డేటాలో 618 ఫోన్ నెంబర్లను సిట్ గుర్తించినట్టు తెలుస్తోంది. ప్రభాకర్ రావు.. పలువురు బీఆర్ఎస్ నేతలతో, పోలీసు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపినట్టు అనుమానం వ్యక్తం చేస్తోంది.

మిగతాది 2లో

## తెలంగాణలోని 34 మెడికల్ కాలేజీలకు ఎన్‌ఎంసీ గ్రీన్ సిగ్నల్



తెలంగాణలోని 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ(నేషనల్ మెడికల్ కమిషన్) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక్క కాలేజీకి కూడా జరిమానా ఎన్ఎంసీ జరిమానా విధించలేదు. 4090 ఎంబీబీఎస్ సీట్లు యథావిధిగా కొనసాగనున్నాయి. ఫాకల్టీ కొరతను అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించించింది ఎన్ఎంసీ.ఫాకల్టీ కొరతను అధిగమించేందుకు టీచింగ్ ఫాకల్టీకి పెద్ద సంఖ్యలో ప్రమోషన్లు ఇచ్చింది ప్రభుత్వం. 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు, అడిషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లుగా ప్రమోషన్లు కల్పించింది. వారందరికీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌గా, టీచింగ్ హాస్పిటళ్లకు సూపరింటెండెంట్లుగా నియమించింది.. అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 278 మందికి, ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించింది.

## పాశమైలారం ఘటన.. ఆ 8మంది చనిపోయినట్లే!




హైదరాబాద్:

సిగాచీ పరిశ్రమ ప్రమాదం విషయంలో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ఘటనలో 8 మంది ఆచూకీ లభించడం కష్టమేనని నిర్ణయానికి వచ్చారు. రాహుల్, శివాజీ, వెంకటేష్, విజయ్, అఖిలేష్, జస్టిన్, రవి, ఇర్ఫాన్‌లు పూర్తిగా కాలి బూడిదైపోయి ఉంటారని భావిస్తున్నారు.

# జగన్‌తో కలసి తెలంగాణకు మరణశాసనం

మొదటిపేజీ తరువాయి
తెలంగాణ వదిలితేనే ఏపీ ప్రాజెక్టులకు నీళ్లు వెళ్తాయి. రాష్ట్రానికి వచ్చినప్పుడు వదిలేసి ఏపీ నుంచి తిరిగి వచ్చాక చివరకు తీసుకునేలా చేశారు. రాయలసీమకు వెళ్లిన జలాలను ఏపీ ఒడిసి పట్టుకుంటోంది. జూరాల నుంచే తెచ్చుకుంటే ఏపీ జలాలను కొల్లగొట్టే అవకాశం ఉండేది కాదు. ప్రాజెక్టుల్లో రాష్ట్రానికి వాటా వస్తే తక్కువ ధరకు విద్యుత్ దక్కేదని రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో కొన్ని ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి ఉంటే కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం జరిగేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కానీ, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ఈ మేరకు రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల అంశంపై ప్రజాప్రతినిధులకు ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెటేషన్ ఇచ్చారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. 1976లో బచావత్ ట్రైబ్యునల్ నీటి కేటాయింపులు చేసింది. మూడు రాష్ట్రాలకు 2130 టీఎంసీలు కేటాయించింది. ఉమ్మడి ఏపీ 811, కర్ణాటక 734, మహారాష్ట్రకు 585 టీ-ఎంసీలు కేటాయించింది. బచావత్ ట్రిబ్యునల్ తర్వాత కేంద్రం ఆమోదం లేకుండా ఉమ్మడి ఏపీలో ప్రాజెక్టులు చేపట్టారు. ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, డిండి, పాలమూరు-రంగారెడ్డి, కోయిల్‌సాగర్, బీమా ప్రాజెక్టులు చేపట్టారు. ఉమ్మడి ఏపీలో 261 టీ-ఎంసీలతో ప్రాజెక్టులు చేపట్టినా పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టులు గత పదేళ్లలో పూర్తి చేసి ఉంటే కృష్ణా జలాల్లో న్యాయం జరిగేదన్నారు. ఆల్మట్టి ప్రాజెక్టుపై ఉమ్మడి ఏపీ హయాంలో సుప్రీంకోర్టులో కేసు
వచ్చింది. తెలంగాణకు 575 టీఎంసీలు ఇవ్వాలని బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ముందు వాదనలు వినిపించాం. ఏపీకి 236 టీఎంసీలు ఇవ్వాలని -ట్రైబ్యునల్ ముందు తెలంగాణ వాదించింది. గత ప్రభుత్వం ఏపీకి 512, తెలంగాణకు 299 టీ-ఎంసీలు చాలని చెప్పింది. 2016లో అపెక్స్ కౌన్సిల్‌కు 66:34 శాతంపై లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. 2025 మార్చిలో తెలంగాణకు 71శాతం కృష్ణా జలాలు ఇవ్వాలని లేఖ రాశాం. తెలంగాణ వచ్చిన తర్వాత కృష్ణా జలాల్లో ఎక్కువ అన్యాయం జరిగింది. మల్యాల సామర్థ్యాన్ని 3850 నుంచి 6300 క్యూసెక్కులకు పెంచారు. 2017లో రాయలసీమకు రోజూ 1.09 టీఎంసీలు తీసుకొనే సామర్థ్యాన్ని ఏపీ పెంచుకుందని ఉత్తమ్ అన్నారు. 2020లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44వేల నుంచి 92వేల క్యూసెక్కులకు ఏపీ పెంచుకుంది. జగన్ హయాంలో గోదావరి, కృష్ణా జలాలపై ప్రగతి భవన్‌లో చర్చించారు. శ్రీశైలం నుంచి ఏపీకి అక్రమంగా కృష్ణా జలాల తరలింపునకు పునాదులు పడ్డాయి. రాయలసీమ లిఫ్ట్ పూర్తయితే శ్రీశైలం, సాగర్ అవసరాలపై వినాశన ప్రభావం ఉంటు-ంది. నాగార్జునసాగర్ ఆయకట్టు- పూర్తిగా ఎడారిగా మారే ప్రమాదం ఉంది. 2020లో ఏపీకి మేలు చేసేలా కుట్ర పూరిత చర్యలు చేపట్టారు. అపెక్స్ కౌన్సిల్ భేటీ-ని గత ప్రభుత్వం కుట్రపూరితంగా వాయిదా వేసింది. రాయలసీమ లిఫ్ట్ -టె-ండర్లు పూర్తయ్యాక అపెక్స్ కౌన్సిల్ భేటీ-కి హాజరయ్యారు. అపెక్స్ కౌన్సిల్ భేటీ-వాయిదా వేయక ముందే హాజరైతే బాగుండేది. రాయలసీమ టెండర్లపై కేంద్రం స్టే విధించేలా చర్యలు ఉండేవేమో. రాయలసీమ లిఫ్ట్ -టె-ండర్ల ప్రక్రియ పూర్తికి గత ప్రభుత్వం సహకరించింది. 2019కి ముందే పాలమూరు పూర్తి చేసి ఉంటే రాష్ట్రానికి న్యాయం జరిగేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

## 19వ ఏరియా లెవల్ త్రైపాక్షిక రక్షణ సమావేశ ఏర్పాట్ల పరిశీలించిన జిఎం



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 09:**
ఆర్జీ 1 ఏరియాలో బంగ్లాస్ ఏరియా గెస్ట్ హౌస్ లో నిర్వహించనున్న 19వ ఏరియా లెవల్ త్రైపాక్షిక రక్షణ సమావేశంకు సంబంధించి చేపట్ట వలసిన ఏర్పాట్లు, ప్రణాలికలను అధికారులతో కలిసి ఆర్జీ 1 ఏరియా జిఎం డి.లలిత్ కుమార్ పరిశీలించారు. 19వ ఏరియా లెవల్ త్రైపాక్షిక రక్షణ సమావేశంలో" రక్షణ, సంక్షేమం, సివిల్ మరియు హాస్పిటల్ కు సంబందించి వివిధ యునియన్ల నుండి వారి సలహాలు, సూచనలతో కూడిన త్రైపాక్షిక రక్షణ సమావేశం ఉన్నందున ఇందుకు సంబందించి అన్ని గనులు, ఉపరితల గనులకు సంబందిచిన వివరాలను పూర్తి స్థాయిలో సిద్దం చేసుకోవాలని సూచించారు. త్రైపాక్షిక రక్షణ సమావేశం కు సంబందించిన అన్ని రకాల ఏర్పాట్లను చేపట్టాలని వివిధ డిపార్ట్ మెంట్ల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ యస్.ఓ.టు జియం ఆంజనేయ ప్రసాద్, ఏజెంట్ చిలక శ్రీనివాస్, ఏరియా సేఫ్టి అధికారి సాయి ప్రసాద్, డిజీ.ఎం ఫారెస్ట్ కర్ణ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఐ.టి మేనేజర్ రాజేష్, ఏరియా వర్క్ షాప్ చంద్ర శేఖర్, సివిల్ సూపర్ వైజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ కి సన్మానం





### - దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట జూలై 9**
శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు ఇల్లందకుంట మండలానికి తాహసిల్దార్ గా నూతనంగా వచ్చి ఈ రోజే బాధ్యతలు తీసుకున్నటువంటి దాసరి రాజమౌళి గారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కారం చేసి, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మెమొంటోను బహుమతిగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఆలయ ఫౌండేషన్కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్, దేవస్థానం ధర్మకర్త గొడిశాల పరమేష్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలి

- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయకుమార్
- కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెకు టీడబ్ల్యూజేఎఫ్ సంఘీభావం
- వరంగల్లో కార్మిక సంఘాలతో కలిసి ర్యాలీ

**కరపత్రం ప్రతినిధి-వరంగల్:**
కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక నల్ల చట్టాలను ఎత్తివేయాలని, దేశంలో వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సంపూర్ణ మద్దతు తెలుపుతూ వరంగల్లో జాతీయ కార్మిక సంఘాలు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపుల చట్టాలతో పాటు 44 చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు ఇస్తున్నట్లు తెలియజేశారు. జర్నలిస్టులకున్న వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపు చట్టాల పునరుద్ధరణతో జర్నలిస్టు వృత్తి ప్రమాణాలను కాపాడుకునేందుకు కేంద్రం తక్షణమే వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన నల్ల చట్టాలను ఎత్తివేసే వరకు జర్నలిస్టులు ఐక్యంగా పోరాడాలని అన్నారు. ఈ ర్యాలీలో జిల్లా కార్యదర్శి బొట్ల స్వామిదాసు ఉపాధ్యక్షులు వెల్ది రాజేందర్, కుర్మిల్ల దుర్గారావు, నాయకులు భానోత్ సురేష్, బావుండ్లపల్లి కిరణ్, ఆకోజు సాంబయ్య, బాదం సురేష్, స్వామినాదం, సైదులు, పాలడుగు సురేందర్, అడువ నర్సింగరావు, బుడిగి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## నేనూ కష్టపడి చదవి పైకి వచ్చా
## మీరూ తల్లిదండ్రులకు పేరు తెండి

మొదటిపేజీ తరువాయి
ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిని తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. ఈ సైకిళ్లు మోదీ ఇస్తున్న గిఫ్ట్ అన్నారు.విద్యారంగానికి ఎనలేని ప్రాధాన్యతనిస్తున్న మోదీ సర్కార్ కు ఇది చిన్న ఉదాహరణ అని తెలిపారు. అలాగే, నేను మీలాగే పేదరికం నుంచి వచ్చిన వాడినే.. తిండికి ఇబ్బందులు పడ్డ రోజులు నాకు ఉన్నాయి. కానీ, మా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మమ్మల్ని ఈ స్థాయికి తీసుకువచ్చారని భావోద్వేగం చెందారు. బండి సంజయ్ తమ ఎంపీ పదవిలో ఉన్నంత కాలం ప్రతి ఏటా టెన్త్ పిల్లలకు సైకిళ్లు అందిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాదు, త్వరలోనే ప్రతి విద్యార్థికి 'మోదీ కిట్'ను అందిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. సైకిల్ అనేది సెల్ఫ్ కాన్ఫిడెన్స్ కు ప్రతీక అని పేర్కొన్నారు. ఇక కార్యక్రమంలో కేంద్ర మంత్రిని ఎమ్మెల్సీ కొమరయ్య ఘనంగా సత్కరించారు. రాబోయే నెల రోజుల్లోనే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ పూర్తి చేయనున్నట్లు- బండి సంజయ్ తెలిపారు.

## ఎన్నో కష్టాలు పడి ఈ స్థాయికి వచ్చా..
## మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి : మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి
ఏజెన్సీలో ఇల్లు లేని వారందరికీ గృహాలు మంజూరు చేశానని చెప్పారు సీతక్క. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతి పక్షాలు కుట్రపన్నుతున్నాయన్నారు. బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. పార్టీ ప్రతిష్టకు పాటు పడి.. గ్రామ గ్రామాన పటిష్టం చేయాలని సూచించారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు, పార్టీ, కార్యకర్తలే బలమే తన బలమన్నారు. ప్రజల మన్నలను పొందిన వారే ఉన్నత స్థాయి నేతలుగా ఎదుగుతారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేందుకు పార్టీ. కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు సీతక్క.
అంతకు ముందు ములుగు జిల్లా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సీతక్క తన బర్త్ డే వేడుకలు జరుపుకున్నారు.పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. అక్కడి పిల్లలతో కలిసి కాసేపు గడిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు

### - ప్రభాకర్ రావు ఫోన్ ,ల్యాప్ టాప్ సీజ్

మొదటిపేజీ తరువాయి
మరోవైపు ధ్వంసమైన హార్డ్ డిస్కులలో ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన డేటా ఉన్నట్లు సమాచారం. ఇక జూలై 14న విచారణకు రావాలని ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును సిట్ ఆదేశించింది. ఎఫ్ఎస్ఎల్ ఇచ్చే నివేదిక, సాక్షుల స్టేట్ మెంట్ ఆధారంగా మరోసారి ప్రశ్నించనుంది.2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నవంబర్ 15 నుంచి నవంబర్ 30 వరకు మొత్తం 618 మంది పొలిటీషియన్ల ఫోన్లను ట్యాప్ చేసినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. అలాగే, అందరితో కలిపి మొత్తం 4,200 మంది ఫోన్లను ట్యాప్? చేసినట్లు సిట్ గుర్తించింది. అసెంబ్లీ ఎన్నికలకు విఘాతం కలిగించే కుట్ర చేస్తున్నారని, మావోయిస్టు సానుభూతిపరుల నెపంతో ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు టీం అదే ఏడాది నవంబర్‌లో సర్వీస్ ప్రొవైడర్లకు లిస్ట్ పంపింది. ఈ లిస్ట్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత డిసెంబర్ మొదటి వారంలో ఎస్ఐబీకి చేరింది. ఆయా నంబర్లు ట్యాపింగ్ లో ఉన్నట్లు సంబంధిత టెలికాం కంపెనీలు ఎస్ఐబీకి లిస్ట్ పంపించాయి. అప్పటికే బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సర్వీస్ ప్రొవైడర్లు అందించిన లిస్ట్ లో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సహా కాంగ్రెస్‌లో కీలక నేతలు, బీజేపీ నేతలు, ఎంపీలు ఈటల రాజేందర్?, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు , వైఎస్ షర్మిల, కాంగ్రెస్, బీజేపీ సహా అన్ని ప్రతిపక్ష పార్టీల నేతలు, ముఖ్య అనుచరులకు నంబర్లను సిట్ గుర్తించింది. ఆయా నంబర్లకు ఫోన్లు చేసి సాక్షుల స్టేట్‌మెట్లు రికార్డు చేస్తున్నది.

## హైదరాబాద్ కేబీహెచ్‌బీ కల్తీ కల్లు ఘటనలో ఐదుకి చేరిన మృతులు

మొదటిపేజీ తరువాయి
కల్లు కాంపౌండ్‌లో కల్తీ కల్లు తాగి మొత్తంగా 31మంది అస్వస్థతకు గురైనట్లు సమాచారం. వీరిలో పలువురు నిమ్స్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతుండగా.. కొందరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తొలుత దీని ప్రభావం సాధారణంగానే భావించినా అనూహ్యంగా మృతులు, బాధితుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.

## హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్మోహన్‌రావు అరెస్ట్

మొదటిపేజీ తరువాయి
హెచ్‌సీఏకు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం 10 శాతం టికెట్లు ఉచితంగా ఇస్తోంది. అయితే మరో 20 శాతం టికెట్లు ఫ్రీగా ఇవ్వాలని, లేకుంటే మ్యాచ్‌లు జరగబోనివ్వమని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. అయితే హెచ్‌సీఏ ద్వారా రిక్వెస్ట్ పెట్టుకుంటే ఆలోచన చేస్తామని ఆ సమయంలో హెచ్ఆర్ఎస్ ఆయనకు స్పష్టం చేసింది. అయితే..
తనకు వ్యక్తిగతంగా 10 శాతం వీఐపీ టికెట్లు కచ్చితంగా ఇవ్వాలని, లేకుంటే మ్యాచ్‌లు జరగనివ్వబోమని ఆయన బెదిరింపులకు దిగారు. అందుకు ఎస్ఆర్‌హెచ్ అంగీకరించలేదు. దీంతో లక్నో మ్యాచ్ సందర్భంగా వీఐపీ కార్పొరేట్ బాక్స్‌కు ఆయన తాళాలు కూడా వేయించారు. ఈ పరిణామంతో షాక్ తిన్న ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం.. హైదరాబాద్ నుంచి వెళ్లిపోతామంటూ ప్రకటించడం సంచలన చర్చకు దారి తీసింది.
ఐపీఎల్ టికెట్ల వివాదం నేపథ్యంతో ఈ ఘటనపై విజిలెన్స్ ఎంక్వయిరీకి తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. ఈ వ్యవహారంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా హెచ్‌సీఏ అక్రమాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపిన సీఐడీ.. ఇప్పుడు ఆ అక్రమాలు వాస్తవమేనని తేలడంతో ఏకంగా అరెస్టులు చేసింది.

## తెలంగాణలోని 34 మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి
ఈ ప్రమోషన్లతో అన్ని కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత, డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీల సమస్య తీరనుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న సుమారు 231 మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు ఆరోగ్యశాఖ చర్యలు ప్రారంభించింది.
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, అడిషనల్ డీఎంఈ వంటి పోస్టులను నేరుగా రిక్రూట్ చేసుకునే అవకాశం లేకపోవడంతో, ప్రమోషన్ల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తుంది. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇవిగాక సుమారు మరో 714 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ అంశాలన్నీ మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఎన్ఎంసీకి వివరించారు. దీంతో ఎన్ఎంసీ సంతృప్తి వ్యక్తం చేసింది.
కొన్ని టీచింగ్ హాస్పిటళ్లలో బెడ్ల సంఖ్య తక్కువగా ఉందని ఎన్ఎంసీ లేవనెత్తింది. ఈ నేపథ్యంలో 21 టీచింగ్ హాస్పిటల్స్‌లో కలిపి సుమారు 6 వేలకుపైగా బెడ్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతి కాలేజీ పర్యవేక్షణకు మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలు అన్ని కాలేజీల్లో పర్యటించి, కాలేజీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాయి.
రాష్ట్రంలో 2022 నుంచి 2024 మధ్యలో ఒకేసారి 25 కాలేజీలు ఏర్పాటైన తీరును ఎన్ఎంసీకి అధికారులు వివరించారు. అన్ని కాలేజీలు, వాటి అనుబంధ టీచింగ్ హాస్పిటళ్లకు భవనాలను నిర్మిస్తున్న విషయాన్ని ఎన్ఎంసీ తెలియజేశారు. భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఎన్ఎంసీ, అన్ని పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసుకుని.. విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించింది. 4 నెలల్లో పూర్తిస్థాయిలో అన్ని సమస్యలను పరిష్కరించుకోవాలని ఎన్ఎంసీ సూచించింది. ఈ మేరకు అన్ని కాలేజీలకూ పర్మిషన్లను యథావిధిగా కొనసాగిస్తున్నట్టు స్పష్టం చేసింది.
మరోవైపు ఎంబీబీఎస్ కౌన్సిలింగ్ ప్రక్రియను ప్రారంభించేందుకు కాళోజి హెల్త్ యూనివర్సిటీ సిద్ధమవుతోంది. త్వరలోనే నీట్ స్టేట్ ర్యాంకులను విడుదల చేయనున్నారు. ఆ తర్వాత మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ షెడ్యూల్ ప్రకారం కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నారు.

## పాశమైలారం ఘటన.. ఆ 8మంది చనిపోయినట్లే!

మొదటిపేజీ తరువాయి
ఆచూకీ లభించని ఆ 8 మంది చనిపోయినట్లుగా అధికారులు ప్రకటించారు. అంత్యక్రియలకు సంబంధించిన కార్యక్రమాలు చేసుకోవాలని వారి కుటుంబ సభ్యులకు సూచించారు. ఆచూకీ తెలిస్తే సమాచారమిస్తామని బాధిత కుటుంబాలకు తెలిపారు. డీఎన్ఏ గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో ఇదివరకు 44 మృతదేహాలు గుర్తించిన విషయం తెలిసిందే.

# జులై 11న తెలంగాణకు అమిత్ షా



**మహేందర్ కూరపాటి, కరపత్రం హైద్రాబాద్**
కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది.జులై 11న హైదరాబాద్‌లో అఖిల భారతీయ రాజ్‌భాషా ఆధ్వర్యంలో జరిగే అధికార భాషా ఉత్సవంలో అమిత్ షా పాల్గొననున్నారు.హిందీతో పాటు భారతీయ భాషలను ప్రోత్సహించడానికి, పరిపాలనలో విదేశీ భాషల ప్రభావాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

# జొన్న రొట్టెలు తింటే షుగర్ తగ్గుతుంది



**గజెల్లి రాజేంద్ర ప్రసాద్, కోరుట్ల**
జొన్న రొట్టెలను తినడం వల్ల రక్తంలో గ్లూకోజ్ నియంత్రణలో ఉంటుందని చాలా మంది నమ్ముతారు. గోధుమలు, జొన్నలు, రాగులు, సజ్జలు, అవిసెలు, క్వినోవా, ఓట్స్ తింటే షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.వీటిలో ఏది తిన్నా సరే కాస్త ఆలస్యంగా జీర్ణం అవుతాయి. ఫలితంగా అంత త్వరగా రక్తంలో గ్లూకోజ్ స్థాయులు పెరగవు.అయితే, వీటన్నింటిలో గ్లైసెమిక్ స్థాయులు ఒకేలా ఉంటాయి. ముఖ్యంగా రాగుల్లో మరింత ఎక్కువ.

# మెట్ పల్లి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ కు వీడ్కోలు



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి**
మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్న రావులపల్లి వెంకటేశ్వరరావు బుధవారం ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపన్యాసక బృందం శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొక్కుల గంగాధర్ హాజరయ్యారు.

# కోరుట్ల ఆర్డీవోకు AITUC వినతి పత్రం



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల టౌన్**
కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెగా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా AITUC నాయకుడు శ్రీ సుతారి రాములు ఆధ్వర్యంలో కార్మికులు,మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్డిఓ కార్యాలయం వరకు ర్యాలీ చేసి వినతిపత్రం అందించారు.కనీస వేతనం రూ. 26,000 చేయాలి, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 9000 రూపాయల పెన్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

# జగిత్యాల జిల్లా ఎన్నికలకు మెట్ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు




**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి**
మెట్ పల్లి నుండి జగిత్యాల జిల్లా ఎన్నికలకు మెట్ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు బయలుదేరివెళ్లారు. టీయుడబ్ల్యూజే (ఐజేయు) జగిత్యాల జిల్లా ఎన్నికల్లో మెట్ పల్లి ప్రెస్ క్లబ్ నుండి కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన షేక్ సాజీద్ పాషా, బాసెట్టి హరీష్ కు ఘన సన్మానం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బూరం సంజీవ్ అధ్యక్షులు, మహమ్మద్ అజీమ్ జనరల్ సెక్రెటరీ, తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో వైభవంగా ఆషాఢ మాసం బోనాలు



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం టౌన్**
కోరుట్లలోని భీముని దుబ్బా సాయి జీనియస్ పాఠశాలలో బుధవారం ఆషాడ మాస బోనాల ఉత్సవాలు భక్తితో జరుపుకున్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించి ఊరేగింపు నిర్వహించారు. కరస్పాండెంట్ చౌకి రమేష్ బోనాల ప్రాముఖ్యత వివరించగా, ప్రిన్సిపల్ సుధా సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యతను గుర్తుచేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# కోరుట్లలో ఏబివిపి ఆవిర్భావ దినోత్సవం



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల టౌన్**
కోరుట్ల నగరంలో బుధవారం నిర్వహించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవంకు విద్యార్థి పరిషత్ నాయకులతో కలిసి ఏబీవీపీ ఆవిర్భావ వేడుకల్లో యువతీ యువకులు పాల్గొనడం జరిగింది. జాతీయ విద్యార్థి దినోత్సవ స్ఫూర్తితో ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థిని విద్యార్థులు, యువతీయువకులు దేశసేవలో సామాజిక లక్ష్యాల సాధనలో నిమఘ్నం కావాలని కోరుకుంటున్నాను అనిపెండెం గణేష్ అన్నారు. పూర్వ విద్యార్థి పరిషత్ నాయకులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్తో పాటు పలువురు ఏబీవీపీ పూర్వ నాయకులు, ప్రస్తుత కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోరుట్ల అన్నపూర్ణ ఆలయానికి నిధులు



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల టౌన్**
బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కే.ఆర్. సురేష్ రెడ్డి నిధుల నుండి మంజూరైన రూ.1,50,000 విలువైన ప్రొసీడింగ్ పత్రాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బుధవారం అన్నపూర్ణ దేవి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ ఆలయం కోరుట్ల పట్టణంలోని 28వ వార్డులో ఉంది.

# స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి సిద్ధం కండి

**– మల్యాల మారుతి, కథలాపూర్ బిజెపి నాయకుడు**



**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**
బుధవారం జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మండల అధ్యక్షుడు మల్యాల మారుతి మాట్లాడుతూ, ఎప్పుడు వచ్చినా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 19 గ్రామాల్లో ప్రతి బూత్ స్థాయి కార్యకర్త, జూనియర్, సీనియర్ అనే తేడా లేకుండా బీజేపీ విజయానికి శ్రమించాలని కోరారు. గ్రామాల్లో కేంద్రం ఇచ్చే నిధులు, అభివృద్ధి పనుల్ని ఇంటింటికీ వివరించాలని సూచించారు.

# దేశవ్యాప్త కార్మిక సమ్మె మెట్ పల్లి ఆర్డీఓకి వినతి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి**
జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో బుధవారం దేశవ్యాప్త సమ్మె సందర్భంగా మున్సిపల్, గ్రామపంచాయతీ, మధ్యాహ్న భోజన, భవన నిర్మాణ, అమాలి కార్మికులు కలిసి ర్యాలీ నిర్వహించారు. ట్రేడ్ యూనియన్ జాయింట్ ప్లాట్‌ఫామ్ పిలుపు మేరకు మున్సిపల్ కార్యాలయం నుంచి వ్యవసాయ మార్కెట్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేసి వినతిపత్రం సమర్పించారు.

# సత్తక్కపల్లిలో ఎస్బిఐ భీమా క్లైమ్ అందజేత




**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి**
మెట్ పల్లి మండలం సత్తక్కపల్లి గ్రామంలో బక్కశెట్టి స్వామి SBI లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ ప్రెసిడెంట్ క్లబ్ మెంబర్ బైన ప్రశాంత్ దగ్గర స్మార్ట్ ఫార్ట్యూన్ బిల్డర్ ప్లాన్ తీసుకోవడం జరిగింది. ఇటీవల ప్రమాదవశాత్తు బక్కశెట్టి స్వామి హార్ట్ స్టోక్ తో మరణించడం జరిగింది. పాలసీపై ఉన్న ఇన్సూరెన్స్ కవరేజ్ 20, 21, 000 నామిని అయిన స్వామి భార్య బక్కశెట్టి రాజేశ్వరికి బుధవారం చెక్కు అందించడం జరిగింది.

# ఏటీఎం ధ్వంసం

## క్యాష్‌బాక్స్ ఎత్తుకెళ్లిన దుండగులు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జీడిమెట్ల మార్కండేయ నగర్‌లో ఏటీఎం సెంటర్‌లో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి HDFC ఏటీఎం సెంటర్‌లో దుండగులు గంటపాటు అందులోనే ఉండి గ్యాస్ కట్టర్‌తో మూడు ఏటీఎం యంత్రాలను పూర్తిగా కట్ చేసి, అందులోని క్యాష్‌బాక్స్‌ను ఎత్తుకెళ్లారు. అయితే, ఏటీఎం సెంటర్‌లోని అలారం దొంగతనం జరిగిన గంట తరువాత మోగింది. సమాచారం అందుకున్న పోలీసులు సీసీటీవీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

# కొంపల్లిలో భారీ డ్రగ్ ముఠా గుట్టు రట్టు




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
హైదరాబాద్ కొంపల్లిలోని మల్నాడు రెస్టారెంట్‌ను కేంద్రంగా చేసుకుని డ్రగ్స్ సరఫరా చేస్తున్న భారీ రాకెట్‌ను తెలంగాణ నార్కోటిక్ విభాగం 'ఈగల్ టీం' బుధవారం పట్టుకున్నది.రెస్టారెంట్ యజమాని సూర్యతో పాటు పలు పబ్ యజమానులు, 23 మంది పారిశ్రామికవేత్తల ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు.నైజీరియన్లు లేడీస్ హైహీల్స్‌లో డ్రగ్స్ పెట్టి రవాణా చేస్తున్నారు. ఆరుగురు అరెస్ట్ అయ్యారు.

# సర్వాయి పాపన్న గౌడ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
బోడుప్పల్ మునిసిపాలిటీ పరిధిలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సంఘం నూతన కమిటీ ఎన్నికలు మంగళవారం నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడుగా బండి సురేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా అగ్గి రమేష్ గౌడ్, ఖజానాదారు గా పూదరి రాకేష్ గౌడ్ నియమితులయ్యారు.ఈ కమిటీ సంఘ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని సభ్యులు అభిప్రాయపడ్డారు.కార్యక్రమం సజావుగా మరియు పారదర్శకంగా ముగిసింది.

# సీజ్ చేసిన వాహనాలకు 10న మేడ్చల్ లో వేలం




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ లో ఈనెల 10న వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలకు వేలం పాటు నిర్వహించడం జరుగుతుందని మంగళవారం ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపారు.రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో వేలం వేయడం జరుగుతుందని తెలిపారు.సీజ్ చేసిన వాహనాలలో హోండా యాక్టివా, హీరో హోండా, డియో, హీరో స్ప్లెండర్ వాహనాలు ఉన్నాయని సీఐ నవనీత చెప్పారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం జూలై 10 2025

# సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్మికుల మహా ప్రదర్శన

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జులై 9**
దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె లో భాగంగా మోత్కులగూడెం అంబేద్కర్ చౌరస్తా నుండి గాంధీ చౌక్ వరకు సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జమ్మికుంట పట్టణంలో కార్మికుల మహా ప్రదర్శన నిర్వహించడం జరిగిందిలి నాలుగు లేబర్ కోడ్ల రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం 26,000 నిర్వహించాలని , అన్ని రకాల కార్మికులకు కనీస పెన్షన్ 10000 రూపాయలు, పీఎఫ్ ఈఎస్ఐ ,సౌకర్యాలు కల్పించాలని నినాదాలు చేశారు .

ఈ సందర్భంగా కార్మికుల లను ఉద్దేశించి గాంధీ చౌరస్తా కూడలి వద్ద, తెలంగాణ రైతు సంఘం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం అశోక్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పులు శంకర్ లు మాట్లాడుతూ, కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా, జమ్మికుంట లోని కార్మిక వర్గం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు కార్మికులను కట్టు బానిసలుగా చేసేందుకు తీసుకొస్తున్న కార్మిక చట్టాల సవరణను నిలిపివేయాలని,

మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం, కొత్తగా కార్మిక వర్గానికి ఉపయోగపడే చట్టాలను తీసుకురాకపోగా, గతంలో ఉన్న చట్టాలను పెట్టుబడుదారులకు పారిశ్రామికవేత్తలకు బడా వ్యాపార వర్గాలకు అనుకూల







విధంగా మార్చేందుకు ప్రయత్నిస్తుందని, గతంలో రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చిందని, ఇప్పుడు కార్మికులకు నష్టం చేసే విధంగా చట్టాలు సవరణ చేస్తుందని, ఒకపక్క కనీస వేతనాలు లేక పని భద్రత లేక సామాజిక భద్రత లేక కార్మికులు ఇబ్బంది పడుతుంటే, కార్మికులపై భారం మోపేందుకు ఎనిమిది గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచుతూ సవరణ చేయడం ఎవరి ప్రయోజనం కోసం అని ఆయన ప్రశ్నించారు.

దేశంలో నిరుద్యోగం, పెరిగి పోతూ, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని, కొద్దిమంది చేతిలోనే ఆర్థిక సంపద పోగ పడుతుందని, ఇది దేశ పురోగతికి తోడ్పడదని, ఉన్నవాడు మరింత ధనవంతునిగా, లేనివాడు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నాడని, ఇప్పటికైనా కార్మికులకు ప్రజలకు ఉపయోగపడే విధానాలను తీసుకురావాలని లేనట్లయితే ఈ పోరాటం ఒక్కరోజు సమ్మెతో ఆగిపోదని, లేదంటే ప్రజలను ఐక్యం చేసి అన్ని కార్మిక సంఘాలతో కలుపుకొని నిరంతర పోరాటంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు తదితర నాయకులు కార్మికులు పాల్గొన్నారు.వందలాది కార్మికులు ర్యాలీ నిర్వహించడం జరిగింది . గాంధీ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం అశోక్ మాట్లాడుతూ లి బస్టాండ్ నుండి బ్యాంక్ కార్యాలయం వరకు ర్యాలీలి.. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలి. 29 చట్టాలను పాత పద్ధతిలో యధావిధిగా కొనసాగించాలని అలాగే రోజుకు 12 గంటల సమయం పని దినంగా కాకుండా పాత పద్ధతిలోరోజుకు 8 గంటల సమయంగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆలంబిస్తున్న ధోరణి కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూరే విధంగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోర్టులను రద్దు చేయాలి పాత పద్ధతులను చట్టాలను అమలు చేయకపోతే రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్ మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు దొడ్డ సంజీవ్ రవిలు రైతు సంఘం నాయకులు భాస్కర సంపత్ రావు ఖైత లింగారెడ్డి కెవిపిఎస్ జిల్లా నాయకులు వడ్లూరి కిషోర్ రావుల ఓదెలు బుద్ధ మల్ల కుమార్ భవన నిర్మాణ కార్మికులు గేర్ రాజకుమారి ఆశా కార్యకర్తలు టీ జయలక్ష్మి సుజాత రైస్ మిల్ ఆపరేటర్ గడ్డం శోభన్ తో పాటు 500 మంది కార్మికులు పాల్గొన్నారు.

## చట్టాలకు అనుగుణంగా భవిష్యత్తును నిర్మించుకోవాలి..



-రైతులు కేసులు ఉంటే రాజీ పడడం మంచిది
-జిల్లా సివిల్ కోర్ట్ న్యాయమూర్తి సౌజన్య





**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
విద్యార్థులు చట్టాలపై కనీస అవగాహన ఉండాలని సంగారెడ్డి జిల్లా సివిల్ కోర్టు, డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ న్యాయమూర్తి సౌజన్య అన్నారు. అందోలు నియోజకవర్గం పుల్కల్ మండల పరిధిలోని సింగూర్ గురుకుల పాఠశాల, చౌటకూర్ మండలం కోర్పోల్ గ్రామంలో రైతులకు బుధవారం డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యను అభ్యసించాలన్నారు. ఫోక్సో చట్టం, బాల్య వివాహాల చట్టం, బిఎన్ఎస్, జువైనల్ తదితర చట్టాలపై ఆమె విద్యార్థులకు, రైతులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో చట్టాలపై అవగాహన లేక కొందరు తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే లాగా నడుచుకోవాలని ఆమె సూచించారు. మైనర్ విద్యార్థులు వాహనాలను నడపడం నేరమన్నారు. అందుకు చట్టం ప్రకారం అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తుందని, అలాంటప్పుడు విద్యార్థులు తమ జీవితాలను పాడు చేసుకున్నట్టు అవుతుందని ఆమె తెలిపారు. పిన్న వయసులో స్మార్ట్ ఫోన్లను వాడి సోషల్ మీడియాను అనుసరిస్తూ కొందరు విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా నడుచుకుంటే భవిష్యత్తుకు బంగారు బాట వేసిన వారు అవుతారని సూచించారు. ఇలాంటివారు దేశానికి సేవ చేసే వారవుతారని ఆమె అభిప్రాయపడ్డారు. రైతులు కమతాల విషయంలో గొడవలు పడి చట్టాలను తమ చేతిలోకి తీసుకొని ఒకరిపై ఒకరు కేసులు చేసుకుంటున్నారని, దీనివల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కలిసి ఉంటే కలదు సుఖం అన్నట్టుగా నడుచుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని దీంతో గ్రామ అభివృద్ధికి కూడా దోహదం చేసిన వారు అవుతారని ఆమె అభిప్రాయపడ్డారు. రైతులు ఏమైనా కేసులు ఉంటే రాజీ పడడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సుధీర్ కుమార్, బాబు, రైతులు, పాఠశాల ప్రిన్సిపల్ గౌతమ్, ఆగమయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఎస్ఐ టి. వెంకటేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను కొనసాగించాలి

– మజీథియా వేజ్ బోర్డు అమలు చేయాలి
– టిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి







దేశంలో వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను యధావిధిగా కొనసాగించాలని, అదేవిధంగా జస్టిస్ మాజీథియా కమిటీ సిఫార్సుల ఆధారంగా వేజ్ బోర్డును అమలు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపూరావు డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల రద్దుకి నిరసనగా కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహించిన సమ్మె కు సంఘీభావం గా బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు హుజురాబాద్ లో కార్మిక సంఘాలతో కలిసి జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 44 కార్మిక చట్టాలతో పాటు రెండు వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. ఎన్నో ఏండ్లుగా వర్కింగ్ జర్నలిస్టు చట్టం అమలులో ఉందనీ, దాన్ని రద్దు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు వేజ్ బోర్డు అమలు చేయాలని కోరారు. జర్నలిస్టుల పట్ల వివక్ష చూపటం మంచిది కాదన్నారు. మీడియాలో కార్పొరేట్లు ఎంటర్ అయిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, జర్నలిస్టుల హక్కులు హరించి వేస్తున్నారన్నారు. ప్రజాసమస్యలపై అధ్యయనం, హక్కుల సాధన దిశగా జర్నలిస్టులు ముందుకుపోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు చట్ల శంకర్, గాదె కరుణాకర్ రావు, శంకర్ రెడ్డి, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలు

– తెలంగాణ సాంస్కృతిక సారథి కళా ప్రదర్శనలు





**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
సంగారెడ్డి జిల్లా కళాకారులచే ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమాలు ఊరూరా కళాకారుల ప్రదర్శనలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం సంగారెడ్డి నియోజకవర్గం సదాశివపేట మండలం చందాపూర్, పెద్దాపూర్ గ్రామాలలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ జి. వెన్నెల, డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అనుమతితో పొదుపు సంఘాల మహిళలకు ఆటపాట మాట ద్వారా కళాకారులు అవగాహన కల్పించారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మహిళల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలు, స్వశక్తితో మహిళల ఎదుగుదలకు అందిస్తున్న ప్రోత్సాహకాన్ని కళాత్మకంగా కళాకారులు కళాప్రదర్శనలు ఇచ్చారు. వడ్డీ లేని రుణాలు అందిస్తూ మహిళలకు వ్యాపారాలు చేసే విధంగా, పెట్టుబడులు పెట్టి ప్రభుత్వంలో భాగస్వామ్యం చేస్తూ మహిళలను ఆర్థికంగా ఎదిగే విధంగా ప్రోత్సహిస్తున్న విధానాన్ని కళాకారులు పాటల ద్వారా వివరించారు. ఆర్టీసీలో బస్సులకు ఓనరులను చేయడం, పెట్రోల్ బంకుల నిర్వహణ, సోలార్ విద్యుత్ కేంద్రాల నిర్వహణ, ప్రభుత్వ కాంట్రాక్టులలో మహిళలకు అవకాశాలు, క్యాంటీన్ల నిర్వహణ ఇలా ప్రభుత్వ పథకాలతో అనేక అవకాశాలు కల్పిస్తూ మహిళలను కోటీశ్వరులను చేయాలని ముఖ్యమంత్రి సంకల్పాన్ని పాటల ద్వారా మహిళలకు వివరిస్తున్నట్లు కళాకారులు తెలిపారు. కార్యక్రమంలో సదాశివపేట ఎపిఎం నర్సింలు, సిసి రవి, ఆయా గ్రామాలలోని వివో లీడర్లతో పాటు మహిళా సంఘాల సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారుల బృందం టీం లీడర్ ఆయిదాల సునీల్, నీరుడు దుర్గేష్, సంబరబోయిన మల్లేష్, ఏర్పుల వినేష్, పటేల్ సంధ్యా, గౌని శంకర్, భామిని నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## జమ్మికుంట పట్టణంలో ఘనంగా ధారి మైసమ్మ విగ్రహ ప్రతిష్ట

హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట పట్టణం
– విగ్రహ ధత రామడుగు రవీందర్ రావు – సునీత
– జమ్మికుంట కార్ డ్రైవర్స్ అసోసియేషన్ ట్రాలీ , ప్యాసింజర్ ఆటో యూనియన్స్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జులై 9**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో గల హుజురాబాద్ రోడ్డు ఇందిరానగర్ పాలకేంద్రం వద్ద ప్రాచీన మైసమ్మ దేవాలయాన్ని నేడు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా కార్ డ్రైవర్ అండ్ ఓనర్స్ ఆటో ట్రాలీ యూనియన్స్ నిర్వహించుకున్నారు . నిత్యం హుజురాబాద్ నుంచి జమ్మికుంట మార్గంలో కార్లు ఆటోలు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని ఆ తల్లి అశీసులతో బ్రతుకుతున్నాం అని డ్రైవర్ అండ్ ఓనర్స్ యూనియన్ సభ్యులు ప్రతి సంవత్సరం అమ్మవారికి మేకలను భాలిస్తు వనభోజనాలు నిర్వహించుకుంటామని ఇ సంవత్సరం దాతల సహకారం తో విగ్రహ ప్రతిష్ట చేయడం సంతోషంగా ఉందని యూనియన్ సభ్యులు తెలిపారు ..





## ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సమగ్ర విద్య , శ్రేయస్సే లక్ష్యం

-కేజీబీవీ బాలికల పాఠశాల (మైనారిటీ)ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హౌతి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ( మైనారిటీ )ను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం క్లాస్ రూములను పరిశీలించిన కల్లెక్టర్ విద్యార్థులతో మాట్లాడాతూ పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందరికి అందాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు నూతన శైలి బోధనా పద్ధతులు పాటించాలంటూ ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ముఖ్యంగా గణిత శాస్త్రం, సైన్స్, ఇంగ్లీష్ వంటి ముఖ్యమైన సబ్జెక్టుల్లో పిల్లలకు ఆత్మవిశ్వాసం పెంపొందించేలా బోధన జరగాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన





సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీసారు. వంటగదిని తనిఖీ చేసి, అక్కడ శుభ్రత పరిస్థితులు, భోజన పదార్థాల నాణ్యతను ఆమె పరిశీలించారు. ప్రత్యేకంగా మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. భోజన రుచి, నాణ్యత, వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కలెక్టర్ విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భోజనం అందించాలిని ఆదేశించారు. ఆపై స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ నిత్యవసర సామాగ్రి నిల్వలు, నిల్వ విధానాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని వస్తువులు సక్రమంగా నిల్వ చేయాలనీ, ఉపయోగించిన పదార్థాలపై స్పష్టమైన రికార్డులు ఉండాలన్నారు. ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ రాంరెడ్డి, తహసీల్దార్ దశరథ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.